పంటలను ముంచెత్తుతున్న కొవ్వాడ

- ఖరీఫ్ పంట చేతికందని పరిస్థితి
- వేలాది ఎకరాల పంట గంగపాలు
- మూడు మండలాల రైతులకు తప్పని కష్టాలు
- నాలుగు దశాబ్దాలుగా ఆధునీకరణకు నోచుకోని కాలువ



గోపాలపురం మండలం వెంకటాయపాలెంలో చెరువును తలపిస్తున్న చేలు



దేవరపల్లి మండలం గౌరీపట్నంలో వరి చేలను ముంచెత్తిన కొవ్వాడ వరద

దేవరపల్లి: ఆరుగాలం ఎంతో వ్యయప్రయాసలతో పండించిన పంట గంగమ్మతల్లి చేతికి అందనీయడం లేదని కొవ్వాడ కాలువ పరివాహక ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఖరీఫ్‌లో వేసిన పంట కొవ్వాడ కాలువ ముంపునకు గురవుతుంది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పండించిన పంట గంగపాలవుతుందని రైతులు వాపోతున్నారు. కొవ్వాడ కాలువకు ఇరువైపులా దేవరపల్లి, గోపాలపురం, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో పంట పొలాలు ఉన్నాయి. ప్రధానంగా వరి సాగు చేస్తున్నారు. ఏటా అక్టోబరు, నవంబర్ నెలల్లో వచ్చే తుపానులు, అధిక వర్షాలకు పంట పొలాలు కొవ్వాడ కాలువ ముంపునకు గురవుతున్నాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కొవ్వాడ కాలువ ఉధృతంగా ప్రవహించడంతో మూడు మండలాల్లో సుమారు 5500 ఎకరాలు ముంపుకు గురయింది. దాదాపు 12 రోజులు నీటిలో నానడంతో 2300 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్టు అధికారులు లెక్కగట్టారు. నాలుగు దశాబ్దాలుగా ఇవే కష్టాలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

72 కిలోమీటర్లు కొవ్వాడ ప్రవాహం

కొవ్వాడ కాలువ పోలవరం నియోజకవర్గంలోని లక్ష్మీనారాయణదేవిపేట (ఎల్ఎన్‌డీ) వద్ద గల కొవ్వాడ రిజర్వాయర్ నుంచి కొవ్వూరు మండలం మద్దూరు వరకు సుమారు 72 కిలో మీటర్లు ప్రవహిస్తోంది. అధిక వర్షాలు కురిసినప్పుడు కొండ ప్రాంతాల్లో కురిసిన వర్షపునీరు కొవ్వాడ కాలువ ద్వారా ప్రవహిస్తోంది. ఈ కాలువ గోపాలపురం, దేవరపల్లి, తాళ్లపూడి, కొవ్వూరు, చాగల్లు మండలాల మీదుగా మద్దూరు వద్ద పశ్చిమ డెల్టా కాలువలో కలుస్తోంది. కొవ్వాడ రిజర్వాయర్ నుంచి మద్దూరు వరకు కాలువలోని పూడిక తీసి, వెడల్పు చేసి, గట్లు ఎత్తు పెంచవలసి ఉంది. ఈ పనులకు దాదాపు రూ.12 కోట్లు బడ్జెట్ అవసరం ఉంటుందని అధికారుల అంచనా.

ఏటా నష్టపోతున్నాం



కొవ్వాడ కాలువ వల్ల ఏటా నష్టపోతున్నాం. ఖరీఫ్ పంట చేతికి వస్తుందనే నమ్మకం ఉండదు. దేవుడిపై భారం వేసి పంట వేస్తున్నాం. అక్టోబరు, నవంబరు నెలల్లో తుపానులు పంటను ముంచెత్తున్నాయి. ఈ ఏడాది జూలైలో దాదాపు 15 రోజులు భారీ వర్షాలు కురవడంతో కొవ్వాడ కాలువ నీరు పంట చేలను ముంచింది. తాను ఏడు ఎకరాల్లో వరి చేను వేసి రెండు దఫాలు ఎరువు వేశాను. చేను కుళ్లిపోవడంతో సుమారు రూ.2.50 లక్షల నష్టం వచ్చింది.

– ముళ్లపూడి ధర్మరాజు, రైతు, గౌరీపట్నం, దేవరపల్లి మండలం

శాశ్వత పరిష్కారం కావాలి



పంట చేలు ముంపు బారిన పడకుండా శాశ్వత పరిష్కారం కావాలి. ఏటా కాలువ వల్ల నష్టపోతూనే ఉన్నాం. ఐదు ఎకరాల్లో వరి వేశాను. భారీ వర్షాలకు కొవ్వాడ ముంచెత్తింది. 15 రోజులు పంట చేను నీటిలో ఉనిగి ఉండి పూర్తిగా దెబ్బతింది. కాలువ అభివృద్ధి గురించి పట్టించుకున్న నాథుడు లేడు. కాలువను అభివృద్ధి చేసి రైతులను ముంపు నుంచి కాపాడాలి.

– వేములు సుబ్రహమణ్యం, రైతు, వెంకటాయపాలెం, గోపాలపురం మండలం

రైతులను ముంచేస్తున్న కొవ్వాడ



కొవ్వాడ కాలువ రైతులను ముంచేస్తోంది. ఏటా పంట పొలాలు ముంపుబారిన పడుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాలువ నీరు పంట పొలాలను ముంచడంతో రెండెకరాల వరి చేను పూర్తిగా దెబ్బతింది. ఎకరాకు రూ.12 వేలు పెట్టుబడి పెట్టాను. సుమారు రూ.25 వేలు నష్టం వచ్చింది. కాలువ పూడుకుపోవడం వల్ల నీరు పొలాలపై పడుతుంది. కాలువలోని పూడికతీసి గట్లు పటిష్టం చేయవలసి ఉంది.

– మదం త్రిమూర్తులు, రైతు, తిరుగుడుమెట్ట, తాళ్లపూడి మండలం

క్లుప్తంగా

వైద్య శిబిరంలో 67 మందికి సేవలు



ప్రకాశరావుపాలెం వైద్యశిబిరానికి హాజరైన రోగులు

నల్లజర్ల: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ గంగాధరరావు సూచించారు. మండలంలోని ప్రకాశరావుపాలెం గ్రామంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో 67మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.అనుమానితులకు బ్లడ్ శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపారు. ఏ ఒక్కరూ అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకూడదన్నారు. శిబిరంలో సర్పంచ్ కె.జాన్ విక్టర్, ఉప సర్పంచ్ యద్దనపూడి బ్రహ్మారాజు, మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


అంబులెన్స్ సర్వీసు ప్రారంభం

గోపాలపురం: కొండవీటి సంజీవరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన అంబులెన్స్‌ను, కంప్యూటర్ ల్యాబ్‌ను మాజీ మంత్రి తానేటి వనిత శనివారం గోపాలపురంలో ప్రారంభించారు. ఆగస్టు 19 నుంచి గోపాలపురం మండల ప్రజలు అంబులెన్స్ సర్వీసును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కొండవీటి విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేఎస్‌డీ ఆశీర్వాదం, కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సంపత్‌కుమార్, నర్సింగ్ ప్రిన్సిపాల్ సీహెచ్ అనూష, గోపాలపురం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వెలగా శ్రీరామమూర్తి, పోతిరెడ్డి నాగరాజు నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టిన రోజు నాడు సేవా కార్యక్రమాలు

కొవ్వూరు: టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి పుట్టిన రోజు సందర్భంగా శనివారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సీహెచ్‌సీలోని రోగులకు పండ్లు పంపిణీ చేసి, భోజన వసతి ఏర్పాటు చేశారు. స్థానిక అన్న క్యాంటీన్ వద్ద పొట్రు శ్రీనివాస్ ఆధ్వర్యంలో 300 మందికి భోజన వసతి ఏర్పాటు చేశారు. వాత్సల్య వృద్ధాశ్రమంలో ముళ్లపూడి శ్రీనివాస్, అంధుల ఆశ్రమంలో ఎం.వెంకట్రావు, మదర్ థెరిసా హోమ్‌లో జొన్నలగడ్డ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేశారు. తాళ్లపూడి మండలం పెద్దేవం యువకులకు క్రికెట్ కిట్లు అందజేశారు. టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, దాయన రామకృష్ణ, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఫాగింగ్ యంత్రాలు వచ్చాయ్



పట్టణంలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

నిడదవోలు: మూలనపడిన ఫాగింగ్ యంత్రాలకు అధికారులు మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం పట్టణంలో ముమ్మరంగా ఫాగింగ్ చేయిస్తున్నారు. 'వ్యాధుల సీజన్‌లో తాపీగా పనులు' అనే శీర్షికన ఇటీవల 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి మున్సిపల్ కమిషనర్ టి.రాంభూపాల్‌రెడ్డి స్పందించారు. మూలనపడిన రెండు ఫాగింగ్ యంత్రాలను ఆయన బయటకు తీయించారు. వెంటనే గుంటూరుకు పంపించి మరమ్మతులు చేయించారు. పట్టణంలో సుబ్బరాజుపేట, తీరుగూడెం, ఎంవీ నగర్, ఎన్టీఆర్ కాలనీ, గాంధీనగర్ ప్రాంతాల్లో ఫాగింగ్ చేశారు.

రూ.11 కోట్ల ఉపాధి నిధులతో రోడ్ల అభివృద్ధి



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు: ఉపాధి హామీ పథకం నిధులు రూ.11 కోట్లతో నియోజకవర్గంలోని రహదారులను అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.శనివారం నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి మంచినీటి సరఫరా, ఆర్ డబ్ల్యూ ఎస్, పంచాయతీరాజ్, హౌసింగ్, ఇరిగేషన్, రోడ్లు, భవనాలు తదితర శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో రోడ్ల నిర్మాణం, డ్రైన్ల నిర్మాణంతో పాటు డ్రైన్‌లలో పూడిక తీయించే విషయమై ఆయన అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక గణేష్‌చౌక్ సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ను మంత్రి కందుల దుర్గేష్ శనివారం రాత్రి పరిశీలించారు.

శ్రావణ మాస పూజలు

నల్లజర్ల: శ్రావణ మాసం సందర్భంగా అనంతపల్లిలోని ఆనంద తిరుమల వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం అర్చకుడు సంతోష్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో మహిళలు విశేష పూజల్లో పాల్గొన్నారు. లలితా సహస్రనామ పారాయణం, కుంకుమ పూజలు జరిగాయి. మహా హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చంద్రబాబు కుట్ర

- మాజీ ఎమ్మెల్యే , వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఇన్‌చార్జి తలారి వెంకట్రావు
- ప్రక్కిలంకలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం
- తాళ్లపూడి బజార్ సెంటర్ వరకూ కొవ్వొత్తుల ర్యాలీ



తాళ్లపూడిలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయకులు

తాళ్లపూడి: టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని అంబేడ్కర్ విగ్రహాలకు కూడా రక్షణ లేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. విజయవాడలోని అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ శనివారం రాత్రి మండలంలోని ప్రక్కిలంక గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం అక్కడి నుంచి తాళ్లపూడి బజార్ సెంటర్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తలారి వెంకట్రావు మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, దళిత నాయకులు అంబేడ్కర్ విగ్రహం ధ్వంసానికి ప్రయత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని ముక్త కంఠంతో ఖండించారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్‌కు గౌరవం ఇస్తూ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఇది చంద్రబాబుకు ఇష్టం లేదని దానిని ఏదో ఒకటి చేయాలని పన్నిన కుట్ర అన్నారు. విజయవాడ నడిబొడ్డున అక్కడున్న వారి వద్ద నుంచి సెల్ ఫోన్‌లు తీసుకుని లైట్లు ఆర్పి మరీ ధ్వంసం చేశారన్నారు. ప్రభుత్వం తప్పు లేకుంటే తక్షణం దీనిప సమాధానం చెప్పాలి కదా? అని తలారి ప్రశ్నించారు. ప్రభుత్వ కుట్ర ఉందని ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని అంబేడ్కర్ విగ్రహానికి భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ నాయకులు యాళ్ల బాబురావు, పిట్టా శ్రీనివాస్, గూడా విజయరాజు, వల్లభని శ్రీహరి, తిగిరిపల్లి వెంకట్రావు, అందుగుల రవి, మెణ్ణి బ్రదర్స్, గుంటు చిన్నబ్బాయి, కవల నాగేశ్వరరావు, అధిక సంఖ్యలో దళిత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషం

నిడదవోలు రూరల్: విజయవాడ నడిబొడ్డున గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ధ్వంసానికి కూటమి నాయకులు ప్రయత్నించడం హేయమైన చర్యని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మానుకొండ చంద్రబాబు విమర్శించారు. మండలంలోని తాడిమళ్లలో శనివారం ఆయన మాట్లాడారు. నిజానికి విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్టీల్ అక్షరాలను ధ్వంసం చేసినట్టు కనిపిస్తున్నా దాని వెనుక ప్రధాన ధ్యేయం విగ్రహ ధ్వంసమేనని ఆరోపించారు. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితులను పట్టుకొని కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

మద్యం షాపు ఉద్యోగుల తొలగింపు అన్యాయం



తాళ్లపూడి మద్యం షాపునకు వచ్చిన ఎక్సైజ్ ఎస్ఐ లక్ష్మణ స్వామిని నిలదీస్తున్న పిట్టా శ్రీనివాస్

తాళ్లపూడి: మద్యం షాపుల్లో పని చేస్తున్న ఉద్యోగులను కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా తొలగించడాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్ ఖండించారు. మండలంలోని మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సూపర్‌వైజర్, సేల్స్‌మెన్‌లను తొలగించడంతో వారికి మద్దతుగా శనివారం పిట్టా శ్రీనివాస్ తాళ్లపూడిలో ఆందోళన వ్యక్తం చేశారు. తాళ్లపూడి వచ్చిన ఎక్సైజ్ ఎస్ఐ లక్ష్మణస్వామిని ఆయన నిలదీశారు. తాళ్లపూడి మద్యం షాపుల్లో పని చేస్తున్న సిబ్బందిని తొలగించి కొవ్వూరులో పని చేస్తున్న ముగ్గురిని నియమిస్తున్నట్టు సంబధిత శాఖ అధికారులు అదేశాలు జారీ చేశారని శ్రీనివాస్ వివరించారు. ఇక్కడ పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు ఆశోక్, చక్రవర్తి, భాను ప్రసాద్‌లకు సెప్టెంబర్ వరకూ అగ్రిమెంట్ ఉన్నప్పటికీ తొలగించారన్నారు. మండలంలోని 4 షాపుల్లో 14 మంది పని చేస్తుండగా, వారిలో వైఎస్సార్ సీపీ వర్గీయులను మాత్రమే తొలగించడం తగదన్నారు. వారిని విధుల్లోకి తీసు కోకుంటే ఆందోళన చేస్తామని శ్రీనివాస్ హెచ్చరించారు.

మూడు అంశాలతో యూటీఎఫ్ పని చేస్తుంది



ఉండ్రాజవరంలో యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి, మాట్లాడుతున్న రాంబాబు

ఉండ్రాజవరం: అధ్యయనం, అధ్యాపనం, సామాజికం అనే మూడు అంశాలు, లక్ష్యాలతో, హక్కులు, బాధ్యతలు అనేవి రెండు నేత్రాలుగా యూటీఎఫ్ పని చేస్తుందని ఆ సంస్థ జిల్లా సహాధ్యక్షుడు ఐ.రాంబాబు అన్నారు. శనివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ పతాకాన్ని ఆ సంస్థ మండల కార్యవర్గం ఆవిష్కరించింది. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ, మండల సహాధ్యక్షురాలు ఎం.వెంకటలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి బి.రామారావు, సీపీఎస్ మండల కన్వీనర్ ఎస్‌కే మీరాసాహెబ్, బి. శ్రీనివాసు, పాఠశాల హెచ్ఎం కేఎస్‌కే మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్లలో స్వర్ణోత్సవ సంబరాలు

నల్లజర్ల: యూటీఎఫ్‌ను స్థాపించి 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా నల్లజర్ల జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శనివారం స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించారు.అన్ని క్యాడర్లు, మేనేజ్‌మెంట్‌లను ఏకం చేస్తూ ప్రత్యేక సందర్భంలో యూటీఎఫ్‌ను నాటి ఉపాధ్యాయ నేతలు స్థాపించారని జిల్లా కార్యదర్శి మనోహరకుమార్ వివరించారు. ఉమ్మడి జిల్లా జిల్లా కార్యదర్శి ఐవీ సత్యం మాట్లాడుతూ ఎందరో యూటీఎఫ్ నాయకుల కృషి ఫలితంగానే నేడు ఉపాధ్యాయులు ఇన్ని సౌకర్యాలు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎం.గంగరాజు, మండల శాఖ అధ్యక్షుడు ఎస్ఎఫ్ ఆలీ అహ్మద్, మండల ప్రధాన కార్యదర్శి బి.కిశోర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లజర్ల భవాని, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గోపి గోవర్ధన్, యు.కామేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ దాడులపై వనిత ఫైర్

గోపాలపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ టీడీపీ అల్లరి మూకలు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం సర్వసాధారణం అయిపోయిందని రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. మండలంలోని చిట్యాలలో వైఎస్సార్ సీపీ నాయకుడు ముచ్చికర్ల రవి ఇంటిని కూల్చేందుకు టీడీపీ మూకలు శుక్రవారం ప్రయత్నించిన విషయం తెలుసుకున్న మంత్రి వనిత శనివారం ఈ గ్రామం వెళ్లి రవి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రలు పూర్తిగా కొరవడ్డాయన్నారు. ఇప్పటికైనా దాడులను నిలుపుదల చేయాలని లేని పక్షంలో భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం హేయమైన చర్య

విజయవాడలోని బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని మాజీ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. గురువారం రాత్రి టీడీపీ గూండాలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని, శిలా ఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ శనివారం గోపాలపురంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. వనిత మాట్లాడుతూ దళితుల అంబేడ్కర్ విగ్రహాన్ని టీడీపీ గూండాలు ధ్వంసం చేస్తున్నా అధికారులు వారికి కొమ్ము కాయడం, వారికి కాపలా ఉండడాన్ని చూస్తుంటే రాష్ట్ర ఎటు పోతుందోనన్న భయం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ పతాకాలతో ర్యాలీ



చాగల్లులో జాతీయ జెండాతో చేస్తున్న ర్యాలీలో ఎంపీడీవో బుజ్జి, ఇతర అధికారులు

చాగల్లు: అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా చాగల్లులో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎస్.బుజ్జి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. గ్రామస్థాయిలో వివిధ ప్రభుత్వ సంస్థల సిబ్బంది, ప్రజలు, ప్రజాప్రతినిధులు, జాతీయ జెండాలతో చాగల్లు గ్రామ పంచాయతీ వద్ద నుంచి మెయిన్ రోడ్ వరకూ జాతీయ సమైక్యత ఉట్టిపడేలా ర్యాలీ నిర్వహించారు. ఈఓపీఆర్డీ శ్రవణ్‌కుమార్, ఏఈ సూర్యహాస్, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. నెలటూరు, ఎస్.ముప్పవరం, మల్లవరం, చిక్కాల తదితర గ్రామాలలో కూడా హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమాలను పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

ఉండ్రాజవరం: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటిపైనా జాతీయజెండాను ఎగురవేయాలని బీజేపీ నిడదవోలు నియోజకవర్గ కన్వీనర్ బండి సత్యనారాయణ కోరారు. ఉండ్రాజవరంలో శనివారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సింహాద్రి సత్యనారాయణ, బి.శివరామకృష్ణ, కె.నరేంద్ర బాబు, బి.వెంకటేశ్వరరావు, సీమకుర్తి నారాయణ, అక్కిన గోపాలకృష్ణ, మండల కార్యకర్తలు పాల్గొన్నారు.